www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 7 జూన్ 2025
5
తిరుపతి



రేపు యుపిఎస్‌సి ప్రిలిమినరీ పరీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈనెల 8న ఆదివారం జరగనున్న యుపిఎస్‌సి ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు తెలిపారు. జిల్లాలో మొత్తం రెండు పరీక్షా కేంద్రాల్లో 791 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రం లోనికి అనుమతించబోమని తెలిపారు. లక్ష్మీపురం సర్కిల్‌లోని ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కాలేజీ, బాలాజీ కాలనీలోని శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుపిఎస్‌సి అబ్జర్వర్ (న్యూఢిల్లీ) కిరణ్‌కర్లా అరోరా పాల్గొన్నారు.

మోడీ బాటలో కూటమి ప్రభుత్వం

8 గంటల పని విధానం పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కేంద్రంలోని మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలను యధాతథంగా రాష్ట్రంలో అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తూ కార్మికవర్గానికి తీవ్ర ద్రోహం చేసిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అన్నారు. రాష్ట్ర మంత్రివర్గం ఎనిమిది గంటల పని విధానాన్ని సవరిస్తూ 12 గంటలుగా మార్చడం, మహిళలకు నైట్ డ్యూటీలను చట్టబద్ధం చేయడం అత్యంత అన్యాయమైన విషయమన్నారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద మంత్రివర్గం నిర్ణయాలను తక్షణం ఉపసంహరించుకోవాలని కోరుతూ నిరసన చేపట్టారు. పని గంటలు మార్చడంపై ఉన్న శ్రద్ధ కార్మికులకు వేతనాలు పెంచడంపై ఎందుకు లేదని ప్రశ్నించారు. ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జిలాని ప్రసంగిస్తూ రానున్న రోజుల్లో ఆర్టీసీలోనూ పనిభారం పెరుగుతుందన్నారు. కార్మిక చట్టాల రద్దును నిరసిస్తూ జులై 9న దేశవ్యాప్త సమ్మె జరగనుందని, ఆర్టీసీ కార్మికులందరూ సమ్మెలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, మునిరాజా, బుజ్జి, ఇఎస్ కుమార్; భాస్కర్, పరశు రాం పాల్గొన్నారు.

తిరుపతి సిఐటియు కార్యాలయం వద్ద నిరసన

మామిడికి గిట్టుబాటు ధర అమలు చేయాలి: సిపిఎం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యధికంగా సాగు చేస్తున్న మామిడికి గిట్టుబాటు ధర టన్నుకు రూ.12 వేల రూపాయలు ప్రకటించినా అమలుకు నోచుకోకపోవడంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో మామిడి రైతుల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించడానికి పుత్తూరు ప్రాంతానికి సిపిఎం, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మామిడి మార్కెట్ యార్డుకు వెళ్లి నేరుగా మామిడి రైతులతో మాట్లాడడం జరిగిందన్నారు. ప్రతి ఏటా మామిడి దిగుబడి కోసం రెండు పర్యాయాలు క్రిమిసంహారక మందులను పిచికారి చేయాల్సి వస్తుందని ఇందుకుగాను ఎకరాకు రూ.20 వేల రూపాయలు ఖర్చు అవుతుందని రైతులు ఆవేదనతో మాట్లాడారన్నారు. కానీ గుజ్జు ఫ్యాక్టరీ యాజమాన్యాలు కేజీ 5 రూపాయలకు కూడా తీసుకోలేమని చెబుతుండడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నామన్నారు. ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయ సహకారాలు గాని, ఇన్ పుట్ సబ్సిడీ అందించకపోవడంతో అప్పుల పాలవుతున్నామని వాపోయారు యుద్ధ ప్రాతిపదికన మామిడి పంటను రైతుల నుండి టీటీడీ కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం తగు ఆదేశాలు ఇవ్వాలని, మామిడి రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని, మామిడి రైతులకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందించాలని, మామిడి బోర్డును ఏర్పాటు చేసి, మామిడి పల్ప్ పై జిఎస్టి ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం మామిడి రైతులను సకాలంలో ఆదుకోకపోతే తీవ్ర నష్టాలు, అప్పుల ఊబిలో రైతులు మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.సుబ్రహ్మణ్యం, సిపిఎం తిరుపతి నగర కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హేమలత

జెఈఈ టాపర్‌కు ముఖ్యమంత్రి అభినందన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

జెఈఈ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాలలో జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 51వ ర్యాంకు సాధించిన స్థానిక నారాయణ విద్యాసంస్థల విద్యార్థి మాండవ్యపురం భానుచరణ్ రెడ్డి ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పొంగూరు సింధు నారాయణ, శరణి నారాయణల ఆధ్వర్యంలో జెఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో రాష్ట్రం నుంచి జాతీయ స్థాయిలో 100 లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు ముఖ్యమంత్రిని వారి క్యాంపు కార్యాలయంలో కలిసిన సందర్భంగా, ఉత్తమ ర్యాంకులు సాధించినందుకు విద్యార్థులను అభినందించి, ఉన్నత విద్యాభ్యాసం తరువాత వారి సేవలు రాష్ట్రానికి అందించాలని సూచించారు. రాబోయే 10 సంవత్సరాలలో రాష్ట్రం క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రంగా అభివద్ధి చెందుతుందని, ప్రతిభగల యువత రాష్ట్ర అభివృద్ధిలో భాగంకావాలని ఆకాంక్షించారు.

ఏఆర్ డిఎస్పీ రవీంద్ర రెడ్డిపై బదిలీ వేటు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి జిల్లా ఏఆర్ డీఎస్పీ రవీందర్ రెడ్డి పై బదిలీ వేటు పడింది. ఈ మేరకు రాష్ట్ర డిజిపి ఉత్తర్వులు జారీ చేశారు. రవీంద్ర రెడ్డిని తిరుపతి జిల్లా ఏఆర్ నుండి శ్రీకాకుళం జిల్లా ఏఆర్ కు బదిలీ చేశారు. డ్రగ్స్ కేసులో తెలంగాణ రాష్ట్రం కూకట్ పల్లి పోలీసులు ఏఆర్ కానిస్టేబుల్ గుణశేఖర్‌ను, హెడ్ కానిస్టేబుల్ రామచంద్రను అదుపులోకి తీసుకున్నారు. ఇరువురిని అరెస్టు చేసి తెలంగాణ పోలీసులు రిమాండ్ కు తరలించారు. తిరుపతి ఏఆర్ కానిస్టేబుల్ ఇరువురిని సర్వీస్ నుండి డిస్మిస్ చేస్తూ జిల్లా ఎస్ పి హర్షవర్ధన్ రాజు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై సీరియస్ అయిన రాష్ట్ర పోలీసు అధికారులు దానికి కారకులపై చర్యలు తీసుకున్నందుకు సిద్ధమయ్యారు. ఏఆర్ విభాగంలో కింది స్థాయి సిబ్బంది పై పర్యవేక్షణ లేని కారణంగా ఏ.ఆర్ డీఎస్పీ రవీంద్ర రెడ్డి పై బదిలీ వేటు వేసినట్లు సమాచారం.

వజ్ర జ్యువెలరీ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన వజ్రా జ్యువెలరీ షోరూంను తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష శుక్రవారం ప్రారంభించారు. స్థానిక వివి మహల్ రోడ్ లోని లలిత జ్యువెలర్స్ పక్కన ఏర్పాటు చేసిన షోరూంను జ్యోతి ప్రజ్వలనంతో ప్రారంభించారు. అనంతరం డాక్టర్ శిరీష మాట్లాడుతూ వజ్రా జ్యువెలర్స్ అవుట్ లెట్ కొద్ది సంవత్సరాలుగా తిరుపతిలో ఉందన్నారు. ఇపుడు ప్రత్యేకంగా షోరూం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి మహా నగరాలకు పరిమితమైన వజ్ర జ్యువెలర్స్ ను తిరుపతికి తీసుకురావడం శుభ పరిణామం అన్నారు. షోరూం ప్రారంభం సందర్భంగా గ్రాము బంగారుకి వంద రూపాయలు ప్రత్యేక తగ్గింపు అందిస్తున్నారని, ఇక్కడ కొనుగోలు చేసిన వినియోగదారులకు నెలవారి బోనసులు సైతం అందిస్తారని వెల్లడించారు. ఆకర్షణీయమైన ఆభరణాలు అతి తక్కువ ధరలకు ఇక్కడ లభ్యమవుతాయని, వినియోగదారుల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షోరూం ఎమ్‌డి అరుణ మసరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ రమణయ్య, డాక్టర్ నిరూపమా, బ్రాంచ్ హెడ్ మైథిలి, బ్రాంచ్ మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మో ఈగలు.. వామ్మో పురుగులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తొట్టంబేడు మండలంలోని బీడీకాలనీవాసులకు రెక్క పురుగులు, ఈగలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సమీపంలో ఉన్న సివిల్ సప్లై గోదాము నుంచి మందల్లా ఉత్పత్తి అవుతున్న రెక్క పురుగులు, ఈగలు బీడీ కాలనీపై దండయాత్ర చేస్తున్నాయి. నివాస గృహాల్లో పురుగులు చేరని చోటు లేకపోవడంతో కాలనీ వాసులు నరకం అనుభవిస్తున్నారు. సరిగా భోజనం చేయలేకున్నామనీ, కంటినిండా నిద్ర లేకుండా పోతోందని వాపోతున్నారు. సదరు బాధలను సివిల్ సప్లై గోదాములో ఉన్న సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న సివిల్ సప్లై గోదాము నుంచి ఉత్పత్తి అవుతున్న పురుగుల నివారణకు వారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ మధుసూదన్ రావును వివరణ కోరగా నివారణ చర్యలు చేపడతామని చెప్పారు.

13న శ్రీకాళహస్తిలో షర్మిల పర్యటన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల శ్రీకాళహస్తి పర్యటనను విజయవంతం చేయాలని డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్ షర్మిల ఈనెల 13న శ్రీకాళహస్తికి రానున్నారని, ఆర్‌జిఆర్ కల్యాణ మండపంలో సాయంత్రం ఐదు గంటలకు జిల్లాస్థాయి సమావేశం ఉంటుందన్నారు. సంస్థాగత ఎన్నికల ద్వారా మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పదవులు పొందిన నేతలతో సమావేశమై కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు షర్మిల దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి, సూళ్లూరుపేట సమన్వయకర్త వెంకట చలపతి, జిల్లా ఉపాధ్యక్షులు శబరి రాజన్ రెడ్డి, మైనారిటీ ప్రధాన కార్యదర్శి కరిముల్లా పాల్గొన్నారు.

మొక్కలు నాటిన 'ఆస్టర్ నారాయణాద్రి'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌కి చెందిన ఆస్టర్ వాలంటీర్లు తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం సహకారంతో అవగాహన కార్యక్రమం, వక్షార్చన (ట్రీప్లాంటేషన్), మొక్కల పేరు ట్యాగ్ చేసే కార్యక్రమాన్ని శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంయుక్త ముఖ్య పర్యావరణ ఇంజనీర్ ఎస్.ఎస్.ఎస్. మురళి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ - ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ డాక్టర్ శ్రీధర్ ముని హాజరై, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాల్సిన అవసరం, మొక్కలు నాటడం వల్ల కలిగే లాభాలు, పర్యావరణం పరిశుభ్రంగా ఉంచుకోవడంపై విలువైన సందేశాలను అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ఆస్టర్ నారాయణాద్రి వాలంటర్లు 100 మొక్కలను ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో నాటారు.

కుటుంబాలను గుర్తుంచుకోండి : ఎస్పీ

ప్రజాశక్తి - తిరుపతి సిటి ఏదైనా పొరబాటు పని చేసే ముందు మీ వెనుక ఒక కుటుంబం ఉంటుందని, వాళ్లందరి జీవితాలపై ఆ ప్రభావం పడుతుందని గుర్తుంచుకోవాలని జిల్లా ఎస్పి హర్షవర్ధన్‌రాజు సూచించారు. పోలీసు పెరేడ్‌గ్రౌండ్‌లో ఎఆర్ పోలీసు సిబ్బందితో శుక్రవారం పెరేడ్ నిర్వహించారు. పోలీసు ఉద్యోగం అనేది క్రమశిక్షణ కలిగిన ఉద్యోగం అన్నారు. ఎవరైనా తప్పుచేస్తే చర్యలు చాలా సీరియస్‌గా ఉంటాయన్నారు.

శ్రీకాళహస్తి రూపురేఖలు మారుస్తా : ఎంఎల్‌ఏ బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

విజన్ - 2029 డీపీఆర్‌తో శ్రీకాళహస్తి రూపు రేఖలు మార్చనున్నట్లు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో శుక్రవారం ప్రజా దర్బార్ ను నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పుణ్యక్షేత్రంగా, పర్యాటక కేంద్రంగా దినదినాభివద్ధి చెందుతున్న శ్రీకాళహస్తిని మరింతగా అభివద్ధి చేసేందుకు తుడా, కేంద్ర సాయాన్ని కోరుతున్నట్లు చెప్పారు. ఏరియా ఆసుపత్రి దారిని తుడా నిధులు రూ.15 కోట్లు వెచ్చించి విస్తరించనున్నట్లు వివరించారు. మున్సిపాలిటీలో స్లాబ్ ల వారీగా పన్నులు వసూలు చేసేందుకు రెడ్, ఆరెంజ్, గ్రీన్ జోన్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పున:ప్రతిపాదనలతో శివం టూ శివం రోడ్డును రూ. 37 కోట్లతో పూర్తి చేసి ఎస్టీపీ ప్లాంట్ కు మురుగు నీటి అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. కొండమిట్టలో ప్రత్యేక రోడ్లు, ప్రతి ఇంటికీ తాగు నీరు అందివ్వనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలో వీధి దీపాలకు సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మున్సిపాలిటీలో ఉన్న స్క్రాబ్ వాహనాలు విక్రయించి కొత్తవి కొంటామన్నారు. రాజీవ్ నగర్ లో ఆక్రమిత ప్లాట్లు రద్దు చేసి అర్హులకు అందజేయనున్నామని వివరించారు. అదేవిధంగా అర్హులైన జర్నలిస్టులకు మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర నిధులు రూ.23 కోట్లతో దక్షిణ కైలాస నగర్, శ్రీరామ్ నగర్ కాలనీలో మౌళిక వసతులు అభివద్ధి చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి స్కిట్ కళాశాలలో తరగతులు పున్ణ ప్రారంభం కానున్నాయని చెప్పారు. జేఎన్టీయూ అనుబంధంగా మూడు కోట్లతో పనులు జరుగుతున్నాయని తెలిపారు.

పద్మావతి అమ్మవారి సేవలో డాలర్స్ దివాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని తుడా ఛైర్మన్, టిటిడి ఎక్స్ అఫిషియో సభ్యులు డాలర్స్ దివాకర్‌రెడ్డి కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో పి.హరీంద్రనాథ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ తుడా ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారిగా పద్మావతి అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. తుడా పరిధిలో ఉన్న తిరుచానూరును సైతం రాబోయే కాలంలో మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

తుడా ఛైర్మన్‌ను సన్మానించిన

→ **అనిల్ కుమార్ రెడ్డి**

తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని అమ్మిగోస్ మేనేజింగ్ డైరెక్టర్ అనిత్ కుమార్ రెడ్డి ఘనంగా సత్కరించారు. స్థానిక తుడా కార్యాలయంలో శుక్రవారం దివాకర్ రెడ్డిని కలిసిన ఆయన పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి క్రమశిక్షణ కలిగిన వ్యక్తి తన అత్యంత సన్నిహితుడు కావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

సెలవు దినాల్లో కబ్జాపనుల జోరు

గ్రంథాలయాలు విద్యాభివృద్ధికి నాంది

ప్రజాశక్తి - తిరుపతి సిటి

విద్యాభివృద్ధికి గ్రంథాలయాలు నూతన దిశను చూపిస్తాయని వక్తలు ఉద్ఘాటించారు. వేమన విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సికె నారాయణరెడ్డి గ్రంథాలయాన్ని శుక్రవారం ఉదయం శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం ప్రధాన గ్రంథాలయ అధికారి డాక్టర్ సురేంద్రబాబు ప్రారంభించారు. గ్రంథాలయ నిర్వాహకులు మునిరాజ అధ్యక్షత వహించారు. తెలుగు సాహిత్య సీమలో అపారమైన సేవలు అందించిన ప్రముఖ కవి, విద్యావేత్త, జ్ఞానదాత సికె నారాయణరెడ్డి స్మృతిగా ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత లైబ్రేరియన్ షణ్ముగం, టెంకాయల దామోదరం, అంకమనాయుడు, పేరూరు బాలసుబ్రమణ్యం, ఆనందరావు, బిర్లానాయుడు, ప్రముఖ సాహితీవేత్తలు సాకం నాగరాజు, శైలకుమార్, నడ్డినారాయణ, గురునాథం, రెడ్డెప్ప, బాలాజీచౌదరి, ముఖేష్, ఆకుల మల్లేశ్వరరావు పాల్గొన్నారు. గ్రంథాలయంలో 3వేల కంటే ఎక్కువ విలువైన పుస్తకాలు, సంచికలు అందుబాటులో ఉన్నాయి. పోటీ పరీక్షలకు తయారయ్యే విద్యార్థులు, పాఠకులు ఉచితంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. గ్రంథాలయంలో నిరంతరం నూతన పుస్తక పరిచయాలు, చర్చాగోష్ఠులు, రీడింగ్‌క్లబ్‌లు నిర్వహించనున్నట్లు వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున తెలిపారు

యథేచ్ఛగా పంట కాల్వ పూడ్చివేత..

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

అది కోట్లు విలువ చేసే భూమి. సదరు భూమికి సంబంధించి గతంలోనూ అనేక వివాదాలతో కొన్ని సంఘటనలు జరిగి రెవెన్యూ జోక్యంతో సద్దుమణిగిన పరిస్థితి. మళ్లీ ఎలాగైనా తమకు అనుకూలంగా భూమిని మలుచుకోవడానికి లేఔట్ వేసిన వారు మధ్యలో అడ్డుగా ఉందని పంట కాలువను ఎలాగైనా పూడ్చడానికి ప్రత్యేక వ్యూహాలను రచించారు. ప్రభుత్వ సెలవు దినాల్లో అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరు కనుక... ఇదే అదునుగా చూసుకుని జెసిబిల సహాయంతో పంట కాలవను క్రమంగా పూడ్చుకుంటూ వచ్చారు. ఈ ఏడాది జనవరి మాసం నుండి ఈ ప్రక్రియ జరుగుతూ వచ్చి నేడు పంట కాలవను పూర్తిగా పూడ్చివేశారు.

ఇదంతా ఎక్కడ అనుకుంటున్నారా.... మంగళం రవాణా శాఖ కూడలి నుండి శెట్టిపల్లి పోవు మార్గంలో మిట్టగాంధీపురం సమీపంలో జరుగుతుంది ఈ తంతు. సుమారు 5 ఎకరాల పైబడి ఉన్న భూమిలో కొంత భూమి తమదని ఇటీవల జనవరి 22వ తేదీన ఓ మహిళ పెద్ద ఎత్తున తన మనుషులను స్థలం వద్దకు తీసుకువచ్చి గొడవకు దిగిన పరిస్థితి. అటు తర్వాత ఇదే భూమికి సంబంధించి చిన్నపాటి వివాదాలు పోలీస్ స్టేషన్లో కేసులు ఇలా అనేకమే జరిగాయి. పంట కాలువను కాపాడాలని ఈ ఏడాది ప్రారంభంలో చెన్నయిగుంటకు సంబంధించిన రైతులు జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. జనవరి 22వ తేదీ ఆర్డీవో కార్యాలయం నుండి సర్వేయర్లు, మండల సర్వేయర్లు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన రైతులతో కలిసి సర్వే నంబర్ 78లోని పంట కాలువను పరిశీలించి, గ్రామస్తుల వాదనలను రికార్డు చేసుకొని అధికారులు ఉన్నతాధికారులకు నివేదికను సమర్పిస్తామని చెప్పి వెళ్ళిపోయారు. అటు తర్వాత ప్రస్తుతం పంట కాలువ పూడ్చివేతపై తిరుపతి అర్బన్ మండల తహశీల్దార్ భాగ్యలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేస్తూ... రికార్డుల్లో ఉన్న ప్రకారం పంట కాలువను అలానే ఉంచాలని, పూడ్చిన కాలువను పునరుద్ధరించడానికి శ్రీకారం చుట్టారు. అర్బన్ తహశీల్దార్ ఫిర్యాదుతో పంట కాల్వ పూడ్చివేతపై రాజారెడ్డిపై తిరుచానూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయినట్లు సమాచారం.

జనవరి 22వ తేదీన ఆర్డీవో, తిరుపతి అర్బన్ మండల సర్వేయర్లతో పంట కాల్వ రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

నిబంధనల ప్రకారం.....

ఎక్కడైనా పంట కాలువను మలుపులు తిప్పటం, పూడ్చివేయటం వంటి కార్యక్రమాలు చేయడానికి నిబంధనల ప్రకారం వీలులేని పరిస్థితి. అలా చేస్తే రెవెన్యూ చట్టం ప్రకారం కఠినంగా శిక్షలు ఉన్నాయి. పంట కాలువను ఎక్కడైనా అన్యాక్రాంతం చేయడం గానీ, దారి మళ్లించడం గాని చేస్తే గతంలో కోర్టు తీర్పుల ప్రకారం కాలువను యధాస్థితికి పునరుద్ధరించి, మళ్లింపుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తీర్పులు వెలుపడ్డాయి.

పూడ్చిన వారిపై చర్యలు తీసుకుంటాం

తహశీల్దార్, భాగ్యలక్ష్మి, తిరుపతి అర్బన్

మంగళం పరిధిలోని న్యూ మంగళం గ్రామపంచాయతీ గ్రామ లెక్క దాఖలా సర్వేనెంబర్ 78లో గల లే అవుట్ మధ్యలో 13 అడుగుల వెడల్పు గల పంట కాలువ ప్రవహిస్తోంది. దీనిని కొందరు దురుద్దేశపూర్వకంగా రైతులకు ఎంతో ఉపయోగపడే పంట కాలువను తమ స్వార్థ ప్రయోజనాల కోసం జెసిబి యంత్రాల సహాయంతో పూడ్చివేశారని మా దష్టికి వచ్చింది. పంట కాలవను పూడ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు సదరు భూమికి సంబంధించి 22ఏ లో పెట్టడానికి ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. పంట కాలువను పూడ్చిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటున్నాం.

మార్చి 26న జెసిబి యంత్రంతో పంట కాలువను చదును చేస్తున్న దృశ్యం

భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం బుచ్చినాయుడు కండ్రిగ జడ్పీ హైస్కూల్లో మునెమ్మ అధ్యక్షతన మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ మండల మహాసభ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐటియుసి మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్ర హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయనమాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్‌కి పెండింగ్ జీతాలు, గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వంట గది, వంట సామాగ్రి, నీటి కుళాయి సౌకర్యం కల్పించాలన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. విద్యావ్యవస్థలో సంస్కరణ పేరుతో స్కీమ్ వర్కర్లతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కీం వర్కర్లైన మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్, అంగన్వాడీ, ఆశ, గ్రీన్ అంబాసిడర్స్, పంచాయతీ కార్మికులు తదితర స్కీమ్ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని, పరిష్కారం చేయకుంటే రానున్న రోజుల్లో ఏఐటియుసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు.

పుత్తూరు మరాఠి రైల్వే గేట్ మూసివేత

ప్రజాశక్తి - పుత్తూరు: మున్సిపాలిటీలో స్థానికంగా ఉన్న మరాఠి రైల్వే గేటును 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తిరుపతి తిరుత్తణి మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు గమనించాలని కోరారు. పట్టణంలో ఉన్న రైల్వే గేట్ నుంచి రాకపోకలు సాగించాలని వాహనదారులకు సూచించారు. రైల్వే ఓవర్ హెడ్ ఎలక్ట్రికల్ మరమ్మతులు దృష్ట్యా అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు.

చంద్రశేఖర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ నూతన సూపరింటెండెంట్ చంద్రశేఖర్ శుక్రవారం పదవి బాధ్యతలు తీసుకున్నారు. నూతన బాధ్యతలు అందుకున్న వైద్య అధికారి సిబ్బంది సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ అన్నాదొరై, టీవీ సూపర్వైజర్ తిరుమలయ్య, నవీన్, ల్యాబ్ టెక్నీషియన్ సోము పాల్గొన్నారు.

పేద విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజేంద్రప్రసాద్ రెడ్డితో కలిసి ఆయన వరదయ్యపాలెంలో బీసీ బాలికల సంక్షేమ హాస్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హాస్టల్‌కు ప్రభుత్వ భవనం నిర్మించేంత వరకు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. విద్యార్థినులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగం రైతుకు లాభదాయకం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: డ్రోన్ల వినియోగం ద్వారా రైతుల ఖర్చు తగ్గించడంతో పాటు, సమయం కూడా ఆదా అవుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం శ్రీకాళహస్తి నియోజకవర్గం, సహాయ వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆర్ఎస్ భాను ప్రకాష్ రెడ్డితో కలిసి పంట పొలాలకు మందులు పిచికారీ చేసే డ్రోన్ పరికరం ఉపయోగించే విధానాన్ని గురించి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ సంప్రదాయ పద్ధతిలో పురుగుమందుల పిచికారీ చేయడం ద్వారా ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని, డ్రోన్ల వాడకంలో దీని నివారించవచ్చన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై రైతుకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు సుధాకర్ రెడ్డి, భారతి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణంలోని కార్పొరేట్ పాఠశాలలు వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ, ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు మహేష్ పేర్కొన్నారు. పాఠశాలల్లోనే బుక్స్, యూనిఫామ్, బెల్టులు అమ్ముతూ వేలల్లో సొమ్ము చేసుకుంటున్నారన్నారు. వేసవి సెలవుల్లో కూడా ముందస్తు అడ్మిషన్లు చేసుకుని క్లాసులు నిర్వహిస్తున్నారని విమర్శించారు. పట్టణంలో నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పిజిఆర్ఎస్ సమస్యలు పరిష్కరించండి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం తుడా టవర్స్ పనుల పురోగతిని ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం తుడా కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతుల పరిష్కారం, తదితర అంశాలపై శాఖ వారీగా అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై బండ్లను తొలగించండి

నగరంలోని ఫుట్‌పాత్‌పై అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన షాపులను, బండ్లను తొలగించి పాదచారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరంలోని 36 వ వార్డులోని గిరిపురం, రాజన్న పార్కు, రామచంద్ర పుష్కరిణి తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ప్లానింగ్ అధికారులు నగరంలోని ఫుట్ పాత్ లపై ఉన్న షాపులను, బండ్లను తొలగించాలని అన్నారు. ఎవరైనా ఫుట్ పాత్ లు ఆక్రమించి షాపులు పెడితే అపరాధ రుసుముతో పాటుగా వారి వస్తువులను జప్తు చేయాలని ఆదేశించారు. రాజన్న పార్కులో పాడైన ఆట వస్తువులను మరమ్మత్తులు చేయాలని, పెయింటింగ్ వేయించి త్వరగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట తుడా ఈఈ రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.

జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో రాయితీ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: జిల్లాలోని అన్ని ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలలో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తామని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయుడబ్ల్యుజె) తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎం ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి నరేంద్ర ఆధ్వర్యంలో కలెక్టర్కు వినతిపత్రం ఇచ్చారు.స్పందించిన కలెక్టర్ వెంటనే ప్రొసీడింగ్స్ జారీ చేయాలని డిఇఒ, ఆర్ఐఒలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యుజె స్టేట్ మెంబర్ వై కోటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి తారక, జర్నలిస్టులు సురేష్, పురుషోత్తం, విసి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగిద్దాం

చంద్ర రాజేశ్వరరావు చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఎర్రజెండా పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుపతి బైరాగి పట్టెడ, సిపిఐ కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు 111వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి రేణిగుంటకు చెందిన సామాజికవేత్త డాక్టర్ జనార్దన్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ దేశంలో అనేక ప్రజాస్వామ్య ఉద్యమాలను శాంతియుతంగా నడిపినందుకు రాజేశ్వరరావును ఆర్డర్ ఆఫ్ లెనిన్ అవార్డుతో సోవేట్ యూనియన్ సత్కరించాయని తెలిపారు. భూపోరాటాలతో పేదలకు లక్షల ఎకరాల భూమి ఇప్పించిన ఘనడని కొనియాడారు. ఆయన ఆశయాల ఆచరణే ఆయనకు ఘన నివాళి ఆన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, నగర కార్యవర్గ సభ్యులు ఎం రామకృష్ణ, కే పద్మనాభరెడ్డి, ఎన్ మంజుల, ఎన్ శ్రీరాములు, ప్రజానాట్యమండలి గాయకులు హరిబాబు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నారాయణ కళాశాలలో టెలికాం అథారిటీ అఫ్ ఇండియా అవుట్ రీచ్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అవుట్ రీచ్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులకు టెలికాం రంగం అంశాలపై శాస్త్రీయంగా, సాంకేతికంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రీజినల్ మేనేజర్ సిఎహ్ భిక్షం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవి ప్రసాద్ మాట్లాడుతూ భారత్ 6జి విజన్ సంసిద్ధత, ప్రమాణాలు, డెవలపర్లు, ఆపరేటర్లు, వివిధ సంఘాలు 6 జి ని బయటకు తీసుకురావడానికి ఎంతగా కష్టపడుతున్నారో వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాయ్ సిబ్బంది ప్రవీణ్ కుమార్, కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయ శర్మ, డీన్ విశ్వక్ సేన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి కుట్రపూరిత ఆలోచనలు మానాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అభివృద్ధిని చూసి ఓర్వలేక కుట్రపూరిత ఆలోచనలు చేస్తూ విమర్శించడం ఇకనైనా మానుకోవాలని మాజీ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ఎమ్మెల్యే పులివర్తి నాని హితవు పలికారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో జరిగిన అవినీతిపై కూటమి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందని, ఎవరు దోషులని తేలితే వారపై తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు. అయితే లిక్కర్ స్కామ్‌లో మాజీ శాసనసభ్యులు ఉన్నారని కూడా తెలియదని, తానే కావాలంటే అరెస్టు చేసుకోండనడంలో ఆంతర్యం ఏమిటో ప్రశ్నించారు. కసిరెడ్డికి అత్యంత సన్నిహితుల్లో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కూడా ఒకరిని, అందుకే టీటీడీ ధర్మకర్తని మండలిలో సభ్యునిగా చేర్చాలని సిఫార్సు చేశారని గుర్తు చేశారు. తుడా నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ పూర్తి అయ్యిందని, వాస్తవాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం అయినట్లు ఆధారాలు ఉంటే ఎవరికైనా ఫిర్యాదు చేసుకోవచ్చని సవాల్ విసిరారు. దొంగ నోట్ల కేసు మాత్రం విడిచి పెట్టనని, ఆనాడు దొంగ ఓట్ల నమోదుకు సహకరించిన అధికారులు ఎక్కడ ఉన్న వారందరినీ బయటకు తీసుకొస్తానన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు ఈశ్వర్ రెడ్డి, తిరుమలరెడ్డి, గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ అన్నా.. ఆ వ్యాపారమన్నా.. నాకు అసహ్యం



విలేకరులతో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : నా కుటుంబంలో లిక్కర్ వల్ల ఇద్దరిని కోల్పోయానని, అందుకే లిక్కర్ అన్నా.. లిక్కర్ బిజినెస్ అన్నా నాకు నచ్చదని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తుమ్మలగుంటలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లిక్కర్ వ్యాపారం తనకు నచ్చదని తెలిపారు. తన సన్నిహితుడు హైదరాబాద్‌లో కాపురం వున్న వెంకటేష్ కుటుంబాన్ని రెండు రోజులుగా సిట్ అధికారులు తీసుకువెళ్లి హింసించడం అన్యాయమన్నారు. మీ టార్గెట్ నేనే అయితే వచ్చి అరెస్టు చేసుకోండన్నారు. కొల్లు శ్రీనివాస్ తప్పుడు పత్రాలపై సంతకం పెట్టించుకునేందుకు అమాయకులను పెడుతున్న టార్చర్ దారుణమన్నారు. లిక్కర్ స్కాంలో నాకే సంబంధం లేనపుడు నాతోపాటు తిరిగే వారికి ఎలా సంబంధం ఉంటుందో ఆలోచించాలన్నారు. నాపై కేసులు పెట్టి జైలుపాలు చేయాలన్నా తాను సిద్ధంగానే వున్నానన్నారు. అంతేగానీ చిన్నచిన్న ఉద్యోగుల జీవితాలను నాశనం చేయవద్దని చెవిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలిగా మొయిళ్ల గౌరి



మేరిగ మురళికి కృతజ్ఞతలు తెలుపుతున్న మొయిళ్ల గౌరి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వైసీపీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలిగా మొయిళ్ల గౌరి నియమితులైన సందర్భంగా, ఆమె వైఎస్ఆర్సిపి గూడూరు ఇంచార్జ్, ఎమ్మెల్సీ మేరిగ మురళీని గూడూరులో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఆమె వెంట సురేష్ రెడ్డి, తదితరులన్నారు.

త్రివిక్రమ రావుకు వీడ్కోలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల ఎంపీడీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారిగా, ఎంపీడీవోగా గత పది సంవత్సరములుగా పనిచేస్తూ సాధారణ బదిలీపై సత్యవేడు ఎంపీడీవోగా త్రివిక్రమరావు బదిలీ అయ్యారు. శుక్రవారం ఉదయం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు ఎంపీడీవో వెంకటరత్నమ్మ ఆధ్వర్యంలో ఆయనకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బుచ్చినాయుడు కండ్రిగ మండలం సర్పంచి సంఘం అధ్యక్షుడు, నేర్పకోట సర్పంచి ఆరని విద్యానాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రివిక్రమ రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాల్లో అవకతవకలు సహించం

ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కు వినతి ఇస్తున్న ఇంటి లబ్దిదారులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గృహ నిర్మాణం పథకంలో కాంట్రాక్టర్లు సక్రమంగా ఇళ్లు నిర్మించకుండా పేద ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ పథకంపై అధికారులు, లబ్ధిదారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సీఎం సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో అనేక ఇల్లు మంజూరు చేయడం జరిగిందని, ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని తెలిపారు. టిడిపి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనంగా 50వేల రూపాయలు ఇస్తున్నారని లబ్ధిదారులు దగ్గరుండి నివాసాల నిర్మాణాలను పరిశీలించుకోవాలని సూచించారు. అలాగే అక్రమాలకు పాల్పడిన కాంట్రాక్టర్లు హౌసింగ్ ఉద్యోగులపై చర్యలకు సిఫారసు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో శీలం కిరణ్ కుమార్, రహీం, చెంచురామయ్య, మట్టం శ్రావణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలిపిరిలో దివ్యదర్శనం టోకెన్ల జారీ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుమల శ్రీవారి దర్శనార్థం శ్రీవారి మెట్టు మార్గాన కాలినడకన వెళ్లే భక్తులకు శుక్రవారం సాయంత్రం నుండి అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లో దివ్యదర్శనం టోకెన్ల జారీని టిటిడి ప్రారంభించింది. ఈ సందర్భంగా అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ, శ్రీవారి మెట్టు దివ్యదర్శనం టోకెన్ కేంద్రాన్ని శ్రీవారి మెట్టు నుండి అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌కు మార్చడంపై భక్తుల నుండి స్పందన అపారమన్నారు. శ్రీనివాస మంగాపురం ఆలయంలో కౌంటర్లను ఏర్పాటు చేయడానికి భారత పురావస్తు శాఖ అనుమతి రావాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతుండటంతో భక్తుల సౌకర్యార్థం టోకెన్ కౌంటర్లను తాత్కాలికంగా భూదేవి కాంప్లెక్స్‌కు మార్చామన్నారు. ఈ కార్యక్రమంలో జేఈఓ వీరబ్రహ్మం, సీవీ అండ్ ఎస్ఓ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్షల ఫీజు చెల్లింపుకు గడువు

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు పరిధిలో డిగ్రీ ఇన్ స్టెంట్ పరీక్షలకు16 వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని సిఈ రాజమాణిక్యం వెల్లడించారు. డిగ్రీ ఐదవ సెమిస్టర్ ఇన్ స్టెంట్ పరీక్షల కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. 2022 –23 బ్యాచ్ లో రెగ్యులర్ గా డిగ్రీ చదివి, ఐదవ సెమిస్టర్ ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఎస్వీయూ ఇన్ స్టెంట్ పరీక్షలు నిర్వహిస్తుందని, 25/6/2025 నుంచి ఈ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో జరుగుతాయని వివరించారు. అయితే ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫెయిల్ అయిన విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఫీజు చెల్లించాలన్నారు. వివరాలను ఎస్వీయూ పరీక్షల వెబ్ సైట్లో చూడవచ్చని తెలిపారు.

కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి

ప్రజాశక్తి - తిరుపతి : స్విమ్స్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని గత రెండు సంవత్సరాలుగా డైరెక్టర్‌కు, అధికారులకు, టీటీడీ, శ్రీ లక్ష్మీ శ్రీనివాస మాన్ పవర్ కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన సమస్య పరిష్కారం కాకపోవడంతో కార్మికులు సమ్మె బాటకు సిద్ధమయ్యారు. సమ్మె నోటీసు ఇచ్చి గురువారం నుండి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ విధులు నిర్వహిస్తున్నారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో సమ్మెలోకి వెళ్లక తప్పదని సిమ్స్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సూరి, రవిలు తెలిపారు.

కోచింగ్ సెంటర్ కాదు.. కాలేజ్

ప్రజాశక్తి - క్యాంపస్, తిరుపతి సిటీ: స్థానిక ఎంఆర్ పల్లి సర్కిల్లో వున్న నారాయణ కొంచింగ్ సెంటర్ పేరుతో నడుపుతున్న జూనియర్ కాలేజి ముందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సంద్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం విచ్చలవిడిగా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా కోచింగ్ సెంటర్ల పేరుతో, ఒకొక్క విద్యార్థి దగ్గర నుంచి 1,50,000 నుంచి 2,60,000 వరకు ఫీజ్ లు వసూలు చేస్తున్నారని నీట్, ఎంసెట్, ఐఐటి పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని విమర్శించారు. వారి దగ్గరే బుక్స్, యూనిఫాం తీసుకోవాలని, మెటీరియల్ పేరతో 22,000 రూపాయిలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నారాయణ స్కూల్స్ దగ్గరకు వెళ్ళి బుక్స్ అమ్ముతున రూంమ్‌కి తాళాలు వేసి విద్యాశాఖ అధికారులను పిలిపించి సీజ్ చేస్తామన్నారు. అనుమతి లేని నారాయణ జూనియర్ కాలేజీ, స్కూల్ బిల్డింగ్ లను గుర్తించి రోజు వారీ కార్యక్రమాలు చేస్తామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు చంద్ర నాయక్, ఓం రాజ్, వినయ్, విష్ణు, గ్రేస్, సిద్ధు, నాయకులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి విలువివ్వండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మతపరమైన పండుగల్లో మతసామరస్యానికి విలువనిస్తూ ప్రజలు నడుచుకోవాలని వన్ టౌన్ సీఐ గోపి సూచించారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ముస్లిం మైనార్టీ పెద్దలు, బిజెపి, ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్, విహెచ్పీ సంఘాల నేతలతో ఆయన సమావేశమయ్యారు. శనివారం ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని జరుపుకోనున్న నేపథ్యంలో శాంతియుత వాతావరణం ఉండాలని తెలిపారు.

శాంకరి ఆసుపత్రి ప్రారంభం

ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండల కేంద్రంలోని చిలకా మహాలక్ష్మి ఆలయం సమీపంలో శాంకరి ఆసుపత్రిని శుక్రవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఆసుపత్రి ద్వారా పేదలకు ఉన్నత వైద్యం అందించాలని యాజమాన్యానికి వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వహకులు డాక్టర్ శశిధర్ రెడ్డి, డాక్టర్ మానస లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంబ్రిడ్జి మన్సూర్ గ్లోబల్ స్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంబ్రిడ్జి గ్లోబల్ స్కూల్ ను తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. స్థానిక విమల్ రోడ్ లోని ఎం.టవర్స్ లో ఏర్పాటు చేసిన స్కూల్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒకటిన్నర సంవత్సరం నుంచి పది సంవత్సరాల వయసు వరకు స్కూలు, టేక్ కేర్ ను నగరం నడిబొడ్డున ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉద్యోగం చేసే మహిళలు తమ పిల్లల భద్రత కోసం ఇది ఎంత ఉపయోగపడుతుందన్నారు. యూకే బెస్ట్ తో, ఇంటర్నేషనల్ ఎక్సైజ్ ప్రోగ్రాం, సెంట్రలైజేడ్ స్కూల్, పిల్లల భద్రతకు పూర్తి భరోసా అందిస్తుందన్నారు. నిత్యం సీసీ కెమెరాల నిఘాలో స్కూల్ నడుస్తుందని, తమ స్మార్ట్ఫోన్ ద్వారానే పిల్లలు ఏం చేస్తున్నారో ఎప్పటికప్పుడు లైవ్లో చూసుకోవచ్చని తెలిపారు. ఆ స్కూల్ చైర్మన్ కే.జీ. ప్రదీప్ మాట్లాడుతూ ప్రైమరీ నుంచి ఐదవ తరగతి వరకు ఈ స్కూల్లో అత్యధిక సౌకర్యాలతో, ఆటపాటల మధ్య చదువులు కొనసాగించేలా ఇక్కడ వాతావరణం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్రికల్చర్ డిప్యూటీ కమిషనర్ హరిత, అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికష్ణ, టిడిపి నాయకులు మబ్బు దేవ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వృద్ధురాలి మెడలో చైన్ చోరీ

బాధితురాలు కాంతమ్మ

ప్రజాశక్తి - రామచంద్రపురం : మండలంలోని సొరకాయలపాళ్యం పంచాయతీ, చల్లావారిపల్లి గ్రామానికి చెందిన చల్లా కాంతమ్మ (70) మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని లాక్కెళ్లిన ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చల్లావారి పల్లికి చెందిన కాంతమ్మ ఉదయం 10 గంటల సమయంలో పొలం వద్ద పచ్చి గడ్డి కోసుకొని ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి, తలకు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనంలో వెనుక వైపు నుంచి వచ్చి మెడను గట్టిగా పట్టుకుని, నాలుగు సవరాల (30 గ్రాముల) బంగారు గొలుసును మెడలో నుంచి లాక్కుని వెంకట్రామాపురం వైపు వెళ్లిపోయాడు. దీంతో కాంతమ్మ రోడ్డుపై పడిపోయి, మోకాలుకు, కుడి భుజానికి స్వల్ప గాయాలయ్యాయి. ఆమె ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. వారు వెంటనే రామచంద్రాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రామచంద్రపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల ఉన్న సిసి కెమెరాలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్ సి పురం పోలీసులు తెలిపారు.

వీఆర్వో సస్పెన్షన్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం తిరుమల కుప్పం గ్రామానికి చెందిన మధు కుమార్ అనే రైతుకు, పుత్తూరు నందిమంగళం వీఆర్వోగా పనిచేస్తున్న రవీంద్ర నాయక్ ఒక ఎకరా ప్రభుత్వ భూమి ఇప్పిస్తానని, నాలుగు లక్షల రూపాయలు నగదు తీసుకొని, భూమి ఇవ్వకుండా, నగదు ఇవ్వకుండా, గత రెండు సంవత్సరాలుగా రైతును తిప్పికుంటున్నాడు. విసిగిపోయిన ఆ రైతు గ్రామ పెద్దలకు విషయం చెప్పడంతో, అందరూ కలిసి వీఆర్వో దగ్గరకు వెళ్లి నగదు ఇవ్వమని అడగగా.. ఇవ్వను మీరు ఎవరు దగ్గరకైనా వెళ్లి చెప్పుకోండని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. అనంతరం ఆ రైతు అవినీతి నిరోధక చట్టం శాఖ వారిని సంప్రదించగా వారు వివరాలను తీసుకొని, ఫోన్ ద్వారా వీఆర్వోను సంప్రదించారు. వారికి కూడా ఆ వీఆర్వో సక్రమంగా సమాధానం చెప్పక పోవడంతో, వారు వెంటనే తాసిల్దార్‌కు, తిరుపతి జిల్లా రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ విషయం జిల్లా కలెక్టర్‌కు తెలియడంతో ఆయన వెంటనే స్పందించి, విచారణ చేయించి వీఆర్వో మోసం తెలుసుకుని సస్పెండ్ చేయడం జరిగింది.

ముగిసిన పుట్టగొడుగుల విత్తన తయారీ శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో పుట్టగొడుగుల విత్తన తయారీపై దోర్నకంబాల గ్రామస్తులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఇన్చార్జ్ అసోసియేట్ డీన్ డాక్టర్ రెడ్డి శేఖర్ మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేమన, అరుణశ్రీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరుపతి మార్కెట్‌లో మత్తు ఇంజక్షన్ కలకలం.. పరిశీలించిన ఎస్పీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి, ఇందిరా ప్రియదర్శిని మార్కెట్లో యువకులు మత్తు ఇంజక్షన్ వినియోగం ఘటన నగరంలో కలకలం రేపింది. మార్కెట్ లోపల కొంతమంది యువకులు ఇంజక్షన్ల ద్వారా మత్తుమందు, డ్రగ్స్, గంజాయి సేవిస్తూ హల్ చల్ చేస్తున్నారని, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. ఈ విషయమై స్పందించిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు శుక్రవారం రాత్రి, ఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించారు. ఆ విడియోలో ఉన్న ప్రదేశాన్ని పరిశీలించగా ఇది ఇప్పుడు జరినది కాదని నిర్ధారణ అయింది. ఎస్పీ మాట్లాడుతూ మార్కెట్లో ఇలాంటివి జరగకుండా సిసి కెమెరాలు ఎర్పాటు చేస్తామని తెలిపారు. ఆ ప్రదేశంలో సిబ్బందితో గస్తీ ఎర్పాటు చేస్తామన్నారు. ఇలాంటి ఘటనలు దృష్టికి వస్తే.. వేంటనే డయల్ 112 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పత్రికా ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా ఇంటి డాక్యుమెంటు నెం.2897/2021, తేది13.09.2021కు సంబంధించి ఒరిజినల్ దస్తావేజు సూళ్ళూరుపేట పట్టణంలోని జిరాక్స్ షాపు నందు చేసుకొని తిరిగి వస్తుండగా గత నెల 15.05.2025న దారిపోయినది. అవి ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది సెల్ నెం.9493408644నకు తెలియజేయగలరని కోరుకుంటున్నాము.

అడ్రసు
KUDIRI BILVESWARA RAO
S/o. Kameswara Rao,
D.No. 4-7-50, R/o. Bapuji Colony,
Sullurpeta Post & Mandal,
S.P.S.R. Nellore Dist.,
Present Tirupati Dist
Pincode: 524121

మహారాజశ్రీ కర్నూలు మొదటి అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో
M.V.O.P No.348/2024
దూదేకుల.అల్లిసాహెబ్ ...అర్జీదారు
-Vs-
మంగపట్నం శివగురప్ప మరియు వగైరా
... రెస్పాండెంట్లు

3వ రెస్పాండెంటుకు నోటీసులు

3.షేక్ అహమ్మద్ తండ్రి పి.సుబ్బరాయుడు,
ఇంటి.నెం.101, 3వ వీధి, బిస్మిల్లానగర్, రేణిగుంట,
శ్రీబాలాజి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నంబరు M.V.O.P లో అర్జీదారుకు 11-02-2024 వతేదిన రోడ్డు ప్రమాదంలో జరిగిన గాయలకు నష్టపరిహారంగా రూ.6,00,000/-లు,ఇందుపైన యం.వి.ఓ.పి కోర్టులో దాఖలు చేసిన రోజు నుండి 12%ప్రకారం వడ్డీ మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ అర్జీదారులు అర్జీదాఖలు చేసినారు. ఇందులో 3వ రెస్పాండెంటు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 24-6-2025 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
తేది : 24-6-2025

బి.సుబ్బారెడ్డి,
బి.ఇ.సురేంద్రగౌడ్,
అర్జీదారు పరం అడ్వకేట్లు,
కర్నూలు.

పాకాల జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.No. 63 / 2020
Between
వి.బేబమ్మ మరియు వగైరాలు ...వాదులు
మరియు
వి.రోహిత్ D/o. V. సుబ్బరామనాయుడు (D2)
వి.రామసాయి D/o. V. సుబ్బరామ నాయుడు (D3)
నేంద్రగుంట గ్రామం, పాకాల పోస్టు & మండలం,
చిత్తూరు జిల్లా. ...ప్రతివాదులు (D2 & D3)

ప్రకటన

ఇందుమూలముగా ప్రతివాదులు 2 & 3 తెలియజేయడం ఏమనగా వాదులు పై దావాను ప్రతివాదులుపై వేసి వున్నారు. పై దావానందు ప్రతివాదులు 2 మరియు 3 హాజరు అగుటకు గాను 19-6-2025న వున్నది. ఆ దినం ఉదయం 10:30 గంIIలకు మీరుగానీ మీ తరపు న్యాయవాది ద్వారాగాని హాజరు కావలెయును. అట్లు హాజరుకాని యెడల మీకు ప్రతికూలం అవుతుందని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు
యం.వాణి
జె.యం.గౌరి శంకర రాజు
వాదుల తరపు న్యాయవాది, పాకాల

పాకాల జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A.No. 141 / 2020
O.S.No. 63 / 2020
Between
వి.బేబమ్మ మరియు వగైరాలు ...వాదులు
మరియు
వి.రోహిత్ D/o. V. సుబ్బరామనాయుడు (D2)
వి.రామసాయి D/o. V. సుబ్బరామ నాయుడు (D3)
నేంద్రగుంట గ్రామం, పాకాల పోస్టు & మండలం,
చిత్తూరు జిల్లా. ...ప్రతివాదులు (D2 & D3)

ప్రకటన

ఇందుమూలముగా ప్రతివాదులు 2 & 3 తెలియజేయడం ఏమనగా వాదులు పై దావాను ప్రతివాదులుపై వేసి వున్నారు. పై దావానందు ప్రతివాదులు 2 మరియు 3 హాజరు అగుటకు గాను 19-6-2025న వున్నది. ఆ దినం ఉదయం 10:30 గంIIలకు మీరుగానీ మీ తరపు న్యాయవాది ద్వారాగాని హాజరు కావలెయును. అట్లు హాజరుకాని యెడల మీకు ప్రతికూలం అవుతుందని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు
యం.వాణి
జె.యం.గౌరి శంకర రాజు, M.A., LLB.,
వాదుల తరపు న్యాయవాది, పాకాల

పాకాల జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.No. 193 / 2021
Between
సి.త్యాగరాజరెడ్డి ...వాది
మరియు
పి.మహేష్‌బాబు ...ప్రతివాది

ప్రకటన

ఇందుమూలముగా ప్రతివాదికి తెలియజేయడం ఏమనగా వాదికి రావలసిన బాండు బాపత్తుకు గాను పై దావా వేసి వున్నాడు. పై దావా మీ హాజరు అగుటకు గాను 19.06.2025వ తేదీ ఉదయం 10:30 గంIIలకు వున్నది. ఆ దినం మీరుగాని మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరు కావలెయును. అట్లు హాజరు కాని పక్షంన మీకు ప్రతికూలంగా తీర్పు ఇవ్వబడునని ఇందుమూలంగా తెలియజేయడం అయినది.

ఇట్లు
జె.యం.గౌరి శంకర రాజు, M.A., LLB.,
వాది తరపు న్యాయవాది, పాకాల

పాకాల జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A.No. 142 / 2020
O.S.No. 63 / 2020
Between
వి.బేబమ్మ మరియు వగైరాలు ...వాదులు
మరియు
1. వి.రోహిత్ D/o. V. సుబ్బరామనాయుడు (R2)
2. వి.రామసాయి D/o. V. సుబ్బరామ నాయుడు (R3)
నేంద్రగుంట గ్రామం, పాకాల పోస్టు & మండలం,
చిత్తూరు జిల్లా. ...ప్రతివాదులు (R2 & R3)

ప్రకటన

ఇందుమూలముగా ప్రతివాదులు 2 & 3 తెలియజేయడం ఏమనగా వాదులు పై దావాను ప్రతివాదులుపై వేసి వున్నారు. పై దావానందు ప్రతివాదులు 2 మరియు 3 హాజరు అగుటకు గాను 19-6-2025న వున్నది. ఆ దినం ఉదయం 10:30 గంIIలకు మీరుగానీ మీ తరపు న్యాయవాది ద్వారాగాని హాజరు కావలెయును. అట్లు హాజరుకాని యెడల మీకు ప్రతికూలం అవుతుందని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు
యం.వాణి
జె.యం.గౌరి శంకర రాజు, M.A., LLB.,
వాదుల తరపు న్యాయవాది, పాకాల

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ డే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ హాజరయ్యారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుండి ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట ప్రజలకు బ్యాంకింగ్‌కి సంబంధించిన అన్నీ రకాల సేవలను అందుబాటులో ఉంచడానికి గడియారం సెంటర్ దగ్గరలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కామన్ సర్వీస్ సెంటర్‌ను స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ సతీష్ చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్‌బిఐ సిఎస్‌పి నిర్వాహకురాలు గూడూరు రమ్య మాట్లాడుతూ ఎస్‌బిఐకి సంబంధించిన బ్యాంకింగ్ సేవలను ప్రజలకు అత్యంత సులువుగా అందించాలనే ఉద్దేశం తో ప్రారంభించామన్నారు.

అమర రాజాలో పర్యావరణ దినోత్సవం

ప్రజాశక్తి - రేణిగుంట: అమరరాజా సంస్థల్లో ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ కార్యనిర్వాహక అధికారి నరసింహులు నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆపరేషన్స్ ఇండస్ట్రీస్ బ్యాటరీస్ డివిజన్ హెడ్ శ్రీనివాసరావు, ఆటోమేటివ్ బ్యాటరీస్ డివిజన్ హెడ్ మునీశ్వర నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తిరుపతి జిల్లా, కారకంబాడి, చిత్తూరు జిల్లా, నునెగుండ్లపల్లిలో ఉన్న రెండు యూనిట్లలో మొత్తం 500కి పైగా మొక్కలను విభాగాధిపతులు మరియు ఉద్యోగులు కలిసి నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ప్రతి ఒక్కరు యోగ సాధన ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని ఎంపీడీవో వెంకటరత్నమ్మ, మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యంలు పేర్కొన్నారు. బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ యోగ ద్వారా కీళ్ల నొప్పులు, రక్తపోటు, ఊబకాయం రాకుండా చూసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ సిబ్బంది బుచ్చినాయుడు కండ్రిగ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వంటపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, చారిటబుల్ ఫౌండేషన్ టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ కార్యక్రమం అరుణ్ కుమారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ అధికారిణి మాట్లాడుతూ మధ్యాహ్నం వంట వంట చేసే సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యంలు వంట కార్మికులకు ప్రత్యేకమైన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల వట కార్మికులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి

ప్రజాశక్తి -ఏర్పేడు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని చింతలపాలెం పంచాయతీలోని గ్రామీణ ఆరోగ్య కేంద్రం, ప్రైమరీ స్కూల్, అంగన్వాడి, గ్రామంలో పలు ప్రదేశాలలో సిఎంఆర్ ఈకో అల్యూమినియం ప్రైవేట్ లిమిటెడ్ స్థాపించిన సిఎంఆర్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామస్తులు మొక్కల నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ ఈకో అల్యూమినియం కంపెనీ హెచ్ఆర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామాలలో మొక్కలను నాటాలే గాని, తొలగించరాదని వృక్షాలను మనం రక్షిస్తే ఆ వృక్షాలే మనలను రక్షిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపతి నాయుడు (ఎస్ ఓ), చింతలపాలెం సర్పంచ్ బాల ప్రసాద్ యాదవ్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రుచికరమైన, పౌష్టికాహారం అందించండి

రామచంద్రపురం మండలంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి - రామచంద్రపురం: విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకంలో రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందించాలని విజయ వాణి చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రామింగ్ అసోసియేట్ జునైద్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓలు మార్కండేయ నాయుడు, జయ వేలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పరిశుభ్రమైన ఆహారం విద్యార్థులకు అందించాలని తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యార్థులకు మంచి పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించాలని మండల విద్యాశాఖ అధికారి తిరుమల రాజు సూచించారు. మండల విద్యాశాఖ పరిధిలో ఉన్న పాఠశాలలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎగువ కనకంపాలెం పాఠశాలలో విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేట్ వారు సంతోషి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరినాథ్, ఎంటిఎస్ ఉపాధ్యాయులు మణికంఠన్, చెన్నకేశవులు, పాఠశాల చైర్ పర్సన్, భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

వేడుకగా అంకాలమ్మ అమ్మవారి కొలుపు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాలిటీ పరిధిలో గేట్ పుత్తూరు-వాల్మీకి వీధిలో అంకాలమ్మ అమ్మవారి కొలుపు ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో నగరి నియోజకవర్గ శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, రాష్ట్ర యువత కోఆర్డినేటర్ డి జి ధనపాల్, టిడిపి నాయకులు ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ధర్మరాజుల ఉత్సవాల్లో అర్జునుని తపస్సు

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు మండలం పాతవీరాపురంలో జరుగుతున్న 51వ శ్రీకృష్ణ శ్రీ ద్రౌపతి ధర్మరాజుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జునుని తపస్సు ఎక్కుట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతానం లేని మహిళలు తపస్సు మాను చుట్టు ఒక్కపొద్దులు ఉండి వరపడడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, మాజీ జడ్పిటిసి మునిరంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, ఆలయ చైర్మన్ కొంగర కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, రాజా వీధిలో ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి విశేష అలంకరణల చేశారు. ఆలయ ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని నిలిపారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తహశీల్దారుకు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి -కోట : కోట మండలం, తహసిల్దార్ కటారి జయ జయ రావు జన్మదినం సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రెవిన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక కార్యాలయంలో విధులు పూర్తయిన అనంతరం కార్యాలయ సిబ్బంది కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం కార్యాలయ అధికారులు, సిబ్బంది తాహాసిల్దార్ కటారి జయ జయ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహాసిల్దార్ మల్లికార్జున రావు, సివిల్ సప్లై డిటి అజంతల్లా ఖాన్, మండల సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్వోలు కృష్ణ, శ్రీనివాసులు, రమణయ్య, మోహన్, పోలయ్య, సుబ్రహ్మణ్యం, ఏడుకొండలు, వెంకట రమణమ్మ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ ఇంధనం పట్ల దాని దీర్ఘకాలిక నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, మోండెలెజ్ ఇండియా శ్రీ సిటీ ఫ్యాక్టరీలో 6.251 ఎంవిపి క్యాప్టివ్ సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు మోండెలెజ్ ఇండియా సరఫరా చైన్ ఉపాధ్యక్షుడు వెంకట్ వేపేపల్లి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మోండెలెజ్ ఏర్పాటు చేసిన అతిపెద్ద క్యాప్టివ్ సోలార్ ప్లాంట్‌లలో ఇది ఒకటన్నారు. 20 ఎకరాల స్థలంలో పూర్తిగా భారతీయ తయారీదారుల నుండి సేకరించిన ప్యానెల్‌లతో అభివృద్ధి చేయబడిన ఈ ప్లాంట్ సంవత్సరానికి 89.4 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని, సంవత్సరానికి 6,400 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ తగ్గిస్తుందని తెలిపారు. ఈ తగ్గింపు పర్యావరణం లో 35,000ం చెట్ల నుంచి వచ్చే ప్రయోజనానికి సమానమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ సిటీ ఎండి రవిసన్నారెడ్డి, వారి సిబ్బందికి అభినందనలు తెలిపారు.

మానవత్వం చాటుకున్న విఆర్ఓ గౌతమి

ప్రజాశక్తి -కోట : ఓ అనాధ బిక్షగాడు రోడ్డు మీద జారుకుంటూ గత కొన్ని రోజులుగా కోట క్రాస్ రోడ్డు తహసీల్దార్ ఆఫీస్ రోడ్డు సమీపంలో అందరికీ కనిపిస్తుండేవాడు. అయితే శుక్రవారం కోట సెలబ్రేషన్స్ సమీపంలో మహాలక్ష్మి ఆక్వా ఫర్టిలైజర్స్ షాప్ వద్ద ఆ బిక్షగాడు జారుకుంటూ రోడ్డు మీద పోతుండడంతో అటుగా వెళ్తున్న చెందోడు వీఆర్వో గౌతమి, స్కూటీ ఆపి మనస్సు చలించి ఆ బిక్షగాడితో కాసేపు మాటాడారు. నాకు ఎవరూ లేరమ్మ అన్నం తిని చాలా రోజులైంది దేవుడు నన్ను తొందరగా తీసుకొని పోతే బాగుండు అని ఆ బిక్షగాడు విఆర్ఓతో కన్నీరు పెట్టి చెప్పారు. తక్షణం వీఆర్వో గౌతమి మనస్సు చలించి సమీపంలో ఉన్న హోటల్లో బిర్యానీ ప్యాకెట్ ,కూల్ డ్రింక్, త్రాగునీరు తీసుకొని వచ్చి ఇచ్చారు. ఆ ప్రాంతంలో ఉన్న పలువురు వీఆర్వో గౌతమిని అభినందించారు.